

బాలికపై అత్యాచారం

- గర్భవతి అయిన మైనర్
- పరారీలో నిందితులు
- ఆలస్యంగా వెలుగులోకి..

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి

కలకత్తా మెడికో విద్యార్థి అభయ ఘటన దేశమంతా అట్టుడుగుతున్న వేళ ఆధ్యాత్మిక పట్టణం శ్రీకాళహస్తిలో మరో ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఓ మైనర్ బాలిక(13)పై నలుగురు కామాంధులు తరచూ అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమెను గర్భవతిని చేసి పరారయ్యారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని బహదూర్ పేటకు చెందిన మైనర్ చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోవడంతో అమ్మమ్మ ఇంట్లో ఉంటూ తొమ్మిదో తరగతి చదువుతోంది. అయితే బాలిక పేదరికాన్ని, కుటుంబ పరిస్థితులను ఆవకాశంగా తీసుకున్న నలుగురు యువకులు ఆమెపై తరచూ అత్యాచారం చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో బాలికపై అత్యాచార విషయం ఇటీవల వెలుగులోకి రాగా అక్కడి పెద్దలు యువకులను మందలించి రాజీ చేశారు. అయితే మైనర్ బాలిక గర్భవతి అయిందన్న సంగతి తెలుసుకున్న అమ్మమ్మ గురువారం రాత్రి శ్రీకాళహస్తి టూటౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు మధు, సునీల్, చంద్రతో పాటు తిరుపతికి చెందిన మరో యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం శుక్రవారం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా, ఆమెను తిరుపతి రుయాకు వైద్యులు రెఫర్ చేశారు.

గ్రామసభలతో అభివృద్ధికి శ్రీకారం

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం : కలెక్టర్

ప్రజాశక్తి- నారాయణవనం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రామసభల ద్వారా మౌలిక వసతులు కల్పన లక్ష్యంగా ముందుకు సాగుతుందని కలెక్టర అన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అందులో భాగంగానే ఓకే రోజున రాష్ట్రంలోని అన్నీ పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించి ఆయా గ్రామాలకు అవసరమైన పనుల జాబితాకు గ్రామసభ తీర్మానం చేస్తున్నారన్నారు. ఈ గ్రామ సభలలో ప్రజలతో పాటు వార్డుసభ్యుల నుండి ఎమ్మెల్యే, మంత్రి, ముఖ్యమంత్రి వరకు అందరిని భాగస్వాములను చేసి అభివృద్ధికి బాటలు వేస్తున్నారన్నారు. అనంతరం నారాయణవనం గ్రామసభలో తీర్మానం చేసిన పనులు జాబితాను కలెక్టర్ చదివి వినిపించారు. అనంతరం ప్రజా సమస్యలపై కలెక్టర్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శారదమ్మ, డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, ఇరిగేషన్ ఈఈ మదనగోపాల్, ప్రజలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించి గ్రామసభలో తీర్మానం చేస్తారన్నారు. ఇలా తీర్మానం చేసిన పనులను జిల్లా కలెక్టర్‌కు పంపి పరిపాలన అనుమతితో నిధులు కేటాయించి అభివృద్ధికి శ్రీకారం చడుతున్నట్టు ఎమ్మెల్యే వివరించారు. సత్యవేడు నియోజకవర్గంలో మొత్తం 183 గ్రామసభలు శుక్రవారం నిర్వహించడం, తద్వారా 14 కోట్లు పై చిలుకు నిధులు మంజూరు చేసి అభివృద్ధికి నాంది పలుకుతున్నట్లు తెలిపారు.

రేణిగుంట: గ్రామీణ ఉపాధి పనిదినాలు 200 రోజులకు పెంచాలని, గ్రామీణ ఉపాధి కార్మికులకు ఇంటి స్థలం కేటాయించాలని ఎంపిటిసి రాజేశ్వరి కోరారు. ఈ సమస్యలపై గ్రామీణ ఉపాధి కార్మికులు, ఓ వెంకటరమణ గ్రామసభలో అధికారులకు వినతిపత్రం అందజేశారు.

రామచంద్రాపురం: గ్రామ పంచాయతీల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణిప్రసాద్ (నాని) అన్నారు. శుక్రవారం చంద్రగిరి నియోజకవర్గంలోని కమ్మ కండ్రిగ, పెరుమాళ్ళపల్లి, చంద్రగిరి, వడ్డేపల్లి, చిన్నగొట్టుగల్లు గ్రామాలలో గ్రామసభలో పాల్గొన్నారు. డిపిఒ సుశీలదేవి, ఎంపీడీవో శ్రీనివాసులు, తహశీల్దార్ వెంకటరమణ, సర్పంచ్ కావ్య, టిడిపి నాయకులు జనార్దన్ చౌదరి, తిరుమల్ రెడ్డి, ఎన్.చిన్నబాబు, టి.కేశవులు నాయుడు, పి.విజయ్ కుమార్ పాల్గొన్నారు.

సత్యవేడు: పంచాయతీ కార్యాలయంలో స్థానిక సర్పంచ్ మంజుల అధ్యక్షతన జరిగిన గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఎస్సీ శంకర్ నారాయణ పాల్గొన్నారు. గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం నిర్దేశించిన నాలుగు అంశాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. సత్యవేడు మండలంలోని అన్ని పంచాయతీలలో గ్రామసభలు సజావుగా నిర్వహించారు. మాజీ మండల అధ్యక్షుడు పరమశివం (బాపు), కోళ్ల చిన్న, గణేష్, షణ్ముగం పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: మండల పరిధిలోని 28 పంచాయతీలలో ఆయా సర్పంచుల ఆధ్వర్యంలో గ్రామసభలు జరిగింది. స్థానిక పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో సర్పంచ్ బూదూరు వెంకటమ్మ అధ్యక్షతన ఎంపీడీవో సాయిలహరి, ప్రత్యేక అధికారి సుబ్రహ్మణ్యం నాగరాజు ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనుల గుర్తింపుపై గ్రామసభ నిర్వహించారు. టిడిపి మండల ప్రెసిడెంట్ సుధాకర్ నాయుడు, తహశీల్దార్ సుబ్రహ్మణ్యం, ఏపీఓ భానుప్రియ, అగ్రికల్చర్ అధికారిని భారతి, ఏపీఎం ఇందిరా పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు మేరకు మండలంలోని 44 పంచాయతీలలో ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో గ్రామ సభలు నిర్వహించారు. ఇందులో భాగంగా వేడం పంచాయతీలో మండల విద్యాశాఖ అధికారిని ఆర్.భువనేశ్వరి ప్రత్యేక అధికారిగా పాల్గొన్నారు. అలాగే రామాపురం పంచాయతీలో ఆర్ఐ.భాస్కర్ ప్రత్యేక అధికారిగా పాల్గొన్నారు. పంచాయతీలో సైడ్ కాలువలు, రోడ్లు వసతులు కల్పించాలని, ఉపాధి హామీ పనికి సంబంధించి పార, గడ్డపార, పట్టలు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయడంతో పాటు 100 రోజుల ఉపాధి కూలీ పనులను 150 రోజులుగా పెంచాలని వినతులు అందాయని తెలిపారు. సర్పంచ్ కొండయ్య, టిడిపి మాజీ వైస్ ఎంపీపీ దొరైరాజ్ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వరదయ్యపాలెం: మండలంలో శుక్రవారం పలు పంచాయతీల్లో గ్రామసభలు సక్రమంగా జరిగినప్పటికీ, ఇందిరానగర్, పెద్దపాండూరు పంచాయతీలో గ్రామసభలు రసాభసగా సాగాయి. గత కొన్నేళ్లు ఉన్న సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేందటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పలు సమస్యలపై వినతులను అందజేశారు. వరదయ్యపాలెం పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా డీడీ యూ. చిన్నయ్య, జడ్పిటిసి వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ బొప్పన చంద్రబాబు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : గ్రామంలో పనిచేయడానికి సిద్ధంగా ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పథకం ద్వారా పనులు ఇచ్చి ఆర్థికంగా ఆదుకుంటామని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ తెలిపారు. మండల పరిధిలోని గోపాలకృష్ణ పురం గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలో రోడ్డు, డ్రైనేజీ కాలువలు, తాగునీరు, స్మశాన వాటికలు సమస్యలు ఉంటే చెప్పాలని కోరారు. ఎంపీపీ మునివేలమ్మ, ఎంపీడీవో ఇందిరమ్మ, తహశీల్దార్ వెంకటేశ్వర్లు, సర్పంచ్, మాజీ ఎంపీపీ గంజి మాధవయ్య పాల్గొన్నారు.

నాగలాపురం: గ్రామాల అభివృద్ధితోనే స్వర్ణాంధ్రప్రదేశ్ సాధ్యమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. శుక్రవారం నాగలాపురం పంచాయతీ ఆవరణంలో సర్పంచ్ చిన్న దొరై సుధా అధ్యక్షతన నిర్వహించిన ఈ గ్రామ సభలో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఎంపీడీవో పిఎంకె బాబు, తహశీల్దార్ హనుమాన్ నాయక్, వీఆర్వో నాగభూషణం పాల్గొన్నారు

గూడూరు టౌన్: మండల పరిధిలోని కందలి గ్రామంలో నిర్వహించిన గ్రామసభకు ఎంపీడీవో వెంకటేశ్వర రావు పాల్గొని గ్రామాల్లోని సమస్యలపై ఆరా తీశారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలో అభివృద్ధి పనులు చేపట్టవచ్చు అని అవగాహన కల్పించారు. మండల పరిధిలోని 19 పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు. కందలి సర్పంచ్ వెంకటేశ్వర్లు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

ఓజిలి: గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించడం వలన గ్రామాభివృద్ధితోపాటు, మౌలిక సదుపాయలు ఏర్పాడతాయని సర్పంచులు జడ్పిటిసి సభ్యులు రవీంద్ర రాజు, తహశీల్దార్ పద్మావతి, ఎంపీడీవో వీ రజనీకాంత్ , డిఎల్ఎఫ్ఓ రవీంద్రబాబు, ఎంఈఓ శైలజ , ఈవో పిఆర్‌డి మోహన్, ఎస్ఐ రవిబాబు తెలిపారు.

పిచ్చాటూరు: మండలం పిచ్చాటూరు గ్రామంలో సర్పంచ్ కేజీ రోస్ అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో గ్రామాల అభివృద్ధితోనే స్వర్ణాంధ్రప్రదేశ్ సాధ్యమని ఎంపీడీవో రాధా రాణి పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి రాధిక, వీఆర్వో ప్రియాంక, మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి పాల్గొన్నారు.

ఏర్పేడు : మండలంలోని ప్రతి పంచాయతీలో గ్రామసభ ద్వారా గ్రామ ప్రజలచే ఆమోదించబడిన ప్రతి పనిని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సమర్థవంతంగా అమలు చేయాలని సిపిఎం నాయకులు కే.రంగయ్య, కె.వెంకటేశ్వరరావు, కే.చంద్ర అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

తిరుపతి (మంగళం): మంగళం పరిధిలో ప్రజల అవసరాల నిమిత్తం ఆర్టీసీ సర్వీసులను పునరుద్ధరించాలని స్థానిక ప్రజలు శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలో అధికారులకు వినతులను అందించారు. తిరుమల నగర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ వకుళ, స్థానిక టిడిపి కమిటీ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు.

తిరుపతి టౌన్: వేదాంతపురం పంచాయతీలో శుక్రవారం జరిగిన గ్రామసభలలో విజయనగరం కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని ఏపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హేమలత వినతిపత్రం అందజేశారు. తిరుపతి రూరల్ వేదాంతపురం పంచాయతీ విజయనగర కాలనీ ఏర్పాటై 20 సంవత్సరాలు అయినా ఎలాంటి అభివృద్ధికి నోచుకోకపోవడం అన్యాయమన్నారు. ఇకనైనా మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

దళితులు మాకు ఓట్లేయలేదు..
అందుకే సంఘమిత్రను తీసేస్తున్నాం

గ్రామ సభలో ఓ టీడీపీ నేత కులాహంకారపు కూతలు

శ్రీకాళహస్తి: గ్రామసభ సాక్షిగా ఓ టీడీపీ నేత దళితులను కులం పేరుతో దూషించాడు. గత ఎన్నికల్లో మీరు మాకు ఓట్లయలేదు కాబట్టే దళిత సంఘమిత్రను తొలగించేస్తున్నామంటూ అహంకారపు కూతలు కూశాడు. ఈ ఘటన శుక్రవారం తొట్టంబేడు మండలంలోని లింగమనాయుడుపల్లి దళితవాడలో చోటుచేసుకుంది. లింగమ నాయుడుపల్లిలో ఉపాధి హామీ గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా అధికారులు అక్కడ కొలువు తీరారు. అధికారం మారగానే రాజకీయ కక్షతో అక్కడ సంఘమిత్రగా పనిచేస్తున్న ఓ మహిళను తొలగించాలని స్థానిక టిడిపి నేతలు రాజకీయ ఒత్తిళ్లు తెస్తున్నారు. ఈ క్రమంలో అక్కడికి వచ్చిన అధికారులను దళితులు ఎందుకు మా సంఘమిత్రను తొలగిస్తున్నారు అంటూ ప్రశ్నించారు. దీనిపై కలగజేసుకున్న శంకర్ నాయుడు అనే ఓ టిడిపి నేత దళితులను కులం పేరుతో సంబోధిస్తూ మీరు మాకు గత ఎన్నికల్లో ఓట్లు వేయలేదనీ, అందుకే సంఘమిత్రను తొలగించేస్తున్నామంటూ అహంకారపూరితంగా సమాధానం ఇవ్వడం వివాస్పదంగా మారింది.

మా కడుపులు కాల్చొద్దు..

మేఘా క్యాంపు వద్ద వలస కార్మికుల నిరసన

నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

పొట్టకూటి కోసం ఊరు గాని ఊరొచ్చాం.. పగలూ రేయి, ఎండా వాన చూడక గొడ్డు చాకిరి చేశాం.. అయినా మా మీద కనికరం లేకుండా మేఘా యాజమాన్యం మూడు నెలలుగా వేతనాలు ఆపేసి కడుపులు మాడ్చుతోందంటూ ఒరిస్సా, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వలస కార్మికులు శుక్రవారం శ్రీకాళహస్తిలో ఉన్న మేఘా క్యాంపు వద్ద మెరుపు నిరసన తెలిపారు. తమకు అందాల్సిన మూడు నెలల జీతాలు ఇవ్వకుంటే ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ బైఠాయించారు. వేతనాలు ఇవ్వకపోవడంతో మూడు పూటలా తిండి కూడా కష్టంగా మారుతోందనీ, ఒక పూటే తింటూ రెండు పూటలు పస్తులు ఉంటూ రోడ్డు పనులు చేస్తున్నామని వలస కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. మదనపల్లి నాయుడుపేట జాతీయ రహదారి విస్తరణ పనులను మేఘా సంస్థ చేపడుతున్న విషయం అందరికీ తెలిసిందే. అయితే వీరికి అవసరమైన వలస కార్మికులను కాంట్రాక్టు పద్ధతిన ఒరిస్సా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి మేఘా సంస్థ దిగుమతి చేసుకుంది. వలస కార్మికులు కాంట్రాక్ట్ కు ఒప్పబడి పగలూ రాత్రి తేడా లేకుండా గొడ్డు చాకిరీచేస్తున్నారు. అయితే గత మూడు నెలల కాలంగా కాంట్రాక్టర్ కూలీలకు వేతనాలు చెల్లించడం మానేశాడు. దీంతో కూలీలకు పూట గడవడం కష్టంగా మారింది. ఒక పూట తింటూ రెండు పూటలు పస్తులుంటూ రోడ్డు పనులు చేస్తూ వస్తున్నారు. చివరకు కడుపు కాలి మేఘా బేస్ క్యాంపు వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. వీరికి సిఐటియు జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య అండగా నిలిచారు. వలస కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలనీ, వారికి మూడు పూటలా భోజన సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే వలస కార్మికుల ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఫార్మా యాజమాన్యంపై కఠినచర్యలు తీసుకోవాలి

జిల్లా వ్యాప్తంగా సిఐటియు నిరసనలు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు పటిష్టమైన చట్టాలను తేవాలని, శ్రీకాళహస్తి పుష్పిత్ కంపెనీ మృతునికి కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. శుక్రవారం సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా కందారపు మురళి మాట్లాడుతూ ఫార్మ కంపెనీలో గత 25 సంవత్సరాల్లో జరిగిన ప్రమాదాలన్నిటికంటే ఆగస్టు 21న అచ్యుతాపురం ఎసెన్షియ ఫార్మాలో జరిగినదే అతిపెద్ద ప్రమాదం అన్నారు. ఫార్మా కంపెనీ యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యానికి 18 మంది కార్మికులు ప్రాణాలు బలయ్యాయని, పేలుడు దాటికి కార్మికుల శరీర భాగాలు ముక్కలుముక్కలుగా దూరంగా ఉన్న చెట్లు, గోడలు కంచెల పైకి ఎగిరి వచ్చి పడ్డాయంటే ఈ ప్రమాదం ఎంత తీవ్రంగా జరిగిందో దీన్ని బట్టి అర్థమవుతుందన్నారు. శిథిలాలను తొలగిస్తున్నకొదీ అనేక శవాలు బయటపడుతుంటే కార్మికుల కుటుంబాలు ఆర్తనాదాలు వర్ణనాతీతం అన్నారు. కంపెనీ యాజమాన్యం కార్మిక కుటుంబాలకు సరైన సమాచారం ఇవ్వకుండా దాచిపెట్టిందని, 32 మంది కార్మికులు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఫార్మా కెమికల్ కంపెనీల్లో తరచూ ప్రమాదాలు జరగడం అమాయక కార్మికులు బలైపోవడం అనేకమంది కళ్ళు కాళ్ళు చేతులు పోయి క్షతగాత్రులవుతున్నారని, ప్రమాదం జరిగినప్పుడు ప్రభుత్వాలు అధికారులు ప్రజాప్రతినిధులు హడావుడి చేయడం తరువాత యాజమాన్యాల ఇష్టారాజ్యానికి వదిలేయడంతోనే ప్రమాదాలు పెరిగిపోతున్నాయన్నారు. ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు భద్రతా ప్రమాణాలు తీసుకోవడంలో యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని, నాసిరకం కాలంచెల్లిన రియాక్టర్లు పైపులు వాడటం వంటి లోపాలు అనేక కంపెనీలో బయటపడ్డ వాటిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం కూడా ఈ ప్రమాదాలు కారణమన్నారు. శ్రీకాళహస్తి పరిధిలోని పుష్పిత్ కంపెనీలో బీహార్ చెందిన కార్మికుడు అనుమానాస్పదంగా మృతి చెందాడని, దీనిపై సమగ్ర విచారణ జరిపి, మృతుని కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కే.వేణుగోపాల్, జయచంద్ర, బుజ్జి, భాస్కర్, సాయిలక్ష్మి, ప్రసాద్, రాము, సుధాకర్, యుగంధర్ పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: తిరుపతి జిల్లా శ్రామిక మహిళ నాయకురాలు లక్ష్మమ్మ ఆధ్వర్యంలో అచ్యుతాపురం స్పెషల్ ఎకనమిక్ జోన్ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంపై యాజమాన్యంపై కఠినచర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబాలకు కోటి రూపాలయు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. సిఐటియు అధ్యక్షులు రమణయ్య, కార్యదర్శి కె.లక్ష్మయ్య, లక్ష్మి, భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు అల్లెయ్య, రాజేష్, గజేంద్ర, గంగయ్య పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: పరిశ్రమ ప్రాంతాల్లో కార్మికులకు భద్రత, రక్షణ కల్పించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో కార్మికులకు రక్షణ, భద్రత కల్పించాలని,అచ్యుతాపురం ఫార్మా కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నాయకులు పురుషోత్తం, యాసిన్ బాష, రమేష్, కృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యం, రమేష్, హరిచంద్ర, మని పాల్గొన్నారు.

గూడూరు టౌన్: పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్‌లో శుక్రవారం సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. రాష్ట్రంలోని పార్మా, ఇతర పరిశ్రమల్లో ప్రమాదాలు శాతం పెరుగుతూ కార్మికులు భారీ సంఖ్యలో మరణిస్తున్నా, క్షతగ్రాతులుగా మారుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. ఇకనైనా కార్మికుల భద్రత, రక్షణ చట్టాలను మరింత పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఫార్మా యాజమాన్యంపై చర్యలు తీసుకొని మృతుల కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.శ్రీనివాసులు, బివి.రమణయ్య, ఎస్.సురేష్, పామంజి మణి, అడపాల ప్రసాద్, పుట్టా శంకరయ్య, గుర్రం రమణయ్య, ఆర్.శ్రీనివాసులు, బి. చంద్రయ్య పాల్గొన్నారు.

నాయుడుపేట: పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాలను నివారించాలని, పరిశ్రమల్లో కార్మికులకు భద్రత రక్షణ కల్పించాలని కోరుతూ శుక్రవారం మండలం మేనకూరు సెజ్‌లో ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగింది. అనంతరం సేజ్ జోనల్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించడం జరిగింది. సిఐటియు తిరుపతి జిల్లా కార్యవర్గ సభ్యులు పి.మునిరాజా, జిల్లా కార్యదర్శి శివకవి ముకుందం, వడ్డిపల్లి చెంగయ్య, వెంకటగిరి నాయకులు చేజర్ల రమణయ్య, సుబ్రహ్మణ్యం, అల్లేయ్య, మణెమ్మ పాల్గొన్నారు.

కేవీబీపురం: మండలంలోని ఆదిత్య స్పిన్నర్స్ ప్రైవేట్ లిమిటెడ్ మండల కేంద్రంలో ఉన్న జ్యూస్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల పట్ల యాజమాన్యాలు శ్రద్ధ వహించడం లేదని సిఐటియు మండల కార్యదర్శి నాగలాపురం నాగరాజు ఆరోపించారు. పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికుల భద్రత కల్పించాలని కోరుతూ ధర్నా చేశారు.

రేణిగుంట విమానాశ్రయంలో

డిప్యూటి సిఎంకు ఘనస్వాగతం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయితీ రాజ్, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌కు ఘనస్వాగతం లభించింది. ఉప ముఖ్యమంత్రికి తిరుపతి జిల్లా జెసి శుభం బన్సల్, ఎస్పి సుబ్బరాయుడు, తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, చంద్రగిరి ఎంఎల్‌ఎ పులివర్తి నాని, ఆర్డీఓ రవి శంకర్‌రెడ్డి, ఎస్‌డిసి ప్రోటోకాల్ చంద్రశేఖర్, సిసిఎఫ్ చంద్రశేఖర్ రావు, డిఎఫ్ఓ సతీష్ రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన 9.15 గంటలకు అన్నమయ్య జిల్లాలోని పలు గ్రామసభలలో పాల్గొనటానికి బయల్దేరి వెళ్లారు.

ఒంటి కాలిపై నిరసన

ఒంటి కాలిపై నిరసన తెలుపుతున్న చిరువ్యాపారులు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: శ్రీవారి మెట్ట వ్యాపారస్తుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన నిరసన దీక్ష శుక్రవారం మూడో రోజూ కొనసాగింది. ఈసందర్భంగా వేంకటేశ్వర స్వామి బొమ్మను పట్టుకొని ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర, నగర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ మాట్లాడుతూ చిరు వ్యాపారుల న్యాయమైన కోర్కెలను తక్షణమే తీర్చాలని, వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత 20 సంవత్సరాలుగా 31 కుటుంబాలు శ్రీవారి మెట్టు వద్ద వ్యాపారాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, ప్రభుత్వాలు మారిన వీళ్ళ తలరాత మారడం లేదని అన్నారు. చిరుత పులి అనే పేరుతో వీరిని మెట్ల నుండి కిందికి దించేయడం జరిగిందని, ఆరోజు నుంచి నేటి వరకు వారి కుటుంబాలు అనేక ఇబ్బందులకు గురవుతున్న టీటీడీ యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. గతంలో బోర్డులో 31 మంది పేర్లు పెట్టి వీరికి లైసెన్స్ ఇస్తానని మాట ఇచ్చినప్పటికీ దాన్ని పెడచెవిన పెట్టారని, అదేవిధంగా ఇక్కడ వ్యాపారాలు చేసుకోవచ్చని విజిలెన్స్ అధికారులు ఫారెస్ట్ అధికారులు అందరూ చెబుతున్నప్పటికీ ఏమాత్రం టిటిడి పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనుక తక్షణమే వీరందరికి పర్మినెంట్ అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బుజ్జి, యుగంధర్, చిట్టిబాబు, మల్లికార్జున, లోకనాథం, చిరంజీవి, నరసింహా, మొగిలప్ప, రాంబాబు, గణేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంకు వినతి....

శ్రీవారి మెట్ట వ్యాపారస్తుల సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి రేణిగుంట మండలం పుట్టాలమ్మ గుడి దగ్గర వినతి పత్రం సమర్పించడం జరిగిందని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర తెలిపారు. డిప్యూటి సిఎం సమస్యపై స్పందించి టిటిడి ఈవోతో మాట్లాడతానని హామి ఇవ్వడం జరిగిందన్నారు.

పశు గణనపై శిక్షణ

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: స్థానిక జయరామారావు మున్సిపల్ కౌన్సిల్ హాలులో శుక్రవారం 21వ అఖిల భారత పశుగణన-2024పై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి ఏ.రవికుమార్ సూపర్ వైజర్లు, ఎన్యూమరెటర్లకు పశు గణనపై సూచనలు చేశారు. ప్రతి ఐదేళ్లకొకసారి నిర్వహించే పశు గణను పక్కాగా నిర్వహించాలన్నారు. దీని కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రత్యేక మొబైల్ యాప్‌ను ఉపయోగించాలన్నారు. వివిధ పశుసంవర్ధక శాఖ పథకాల ప్రణాళిక కోసం, పశువైద్యం, వ్యాక్సిన్లు మందుల పంపిణీకి ఈ పశుగణన మూలాధారమని తెలిపారు. ఈ పశుగణన వల్ల పశు పోషక, సాంఘిక, ఆర్థిక, స్థితి గతులను అంచనావేయచ్చన్నారు. కార్యక్రమంలో తిరుపతి డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ డి.ఉమామహేశ్వరి, ఏడీలు డాక్టర్ ఎన్‌వి.శ్రీకాంత్ బాబు, డాక్టర్ మునిరాజా, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ యోగానంద్, ఆరు మండలాలకు చెందిన 150 మంది పశు సంవర్ధక శాఖ సహాయకులు పాల్గొన్నారు.

ప్రకాశం పంతులు సేవల శ్లాఘనీయం: వీసి

ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళులర్పిస్తున్న వీసి అప్పారావు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం లో 1954వ సంవత్సరంలో తిరుపతిలో స్థాపించడం, వివిధ విభాగాలను ప్రారంభించడం, వర్సిటీ అభివృద్ధిని చేయడం లో ఆంధ్ర రాష్ట్ర అప్పటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పాత్ర, సేవలు కీలకమని వర్సిటీ వీసి ఆచార్య అప్పారావు పేర్కొన్నారు. శుక్రవారం టంగుటూరి ప్రకాశం పంతులు 150వ జయంతిని పురస్కరించుకొని పరిపాలన భవనం ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్సిటీలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది, వర్సిటీలో చదువుకుంటున్న విద్యార్థులు, పరిశోధకులు అందరూ ఆయనను మనసున చేసుకోవాల్సిన అవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎమ్. భూపతి నాయుడు, నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీధర్ గురుకొండ, కార్యదర్శి నెల్లూరు సుబ్రహ్మణ్యం, మీడియా కోఆర్డినేటర్ మనోజ్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని పాఠశాలలో శుక్రవారం ఉదయం ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈవో రవీంద్రనాథ్ హాజరయ్యారు. మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రూపేష్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిరుపతి టౌన్: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా నగర పాలక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆదర్శప్రాయుడు అని, స్మరించుకోవడం మన బాధ్యతని నగర మేయర్ డాక్టర్ శిరీష అన్నారు.ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా శుక్రవారం ఉదయం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆర్.సి. మునికృష్ణ, నారాయణ, అదనపు కమిషనర్ చరణ్ తేజ రెడ్డి, ఉప కమిషనర్ అమరయ్య,డి.సి.పి. శ్రీనివాసన్ రెడ్డి,రెవెన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, మేనేజర్ చిట్టిబాబు, డి.ఈ.రవీంద్రనాథ్ రెడ్డి, సూపరింటెండెంటు రవి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ నారాయణ మెడికల్ కాలేజ్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రవి ప్రసాద్ మాట్లాడుతూ రక్తదానం సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. రక్తదానం చేయటం వల్ల ఆపదలో ఉన్నవారిని కాపాడుకోవచ్చు అన్నారు. ఇదే విధంగా మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించేలా విద్యార్థులకు అవగాహనా కల్పించారు. అనంతరం 150 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ విశ్వక్సేన రెడ్డి, అధికారి కోటేశ్వర్ రావు , ఏఓ కొండారెడ్డి , హెమటాలజిస్ట్ యశోవర్ధన్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతి సిటీ: చిల్లీస్ అధినేత అంజి పుట్టినరోజు సందర్భంగా యువత రక్తదానం నిర్వహించారు. స్థానిక ఎయిర్ బైపాస్ రోడ్ లోని చిల్లీస్ రెస్టారెంట్ వద్ద జరిగిన కార్యక్రమంలో అంజి మాట్లాడుతూ ప్రతి ఏడాది తన పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. యువత సేవా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జస్వంత్, శ్యామ్ పాల్గొన్నారు.

శ్రీ సిటీ సిఐని కలిసిన ఎంఆర్‌పిఎస్ నాయకులు

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు నియోజకవర్గం శ్రీసిటీ పోలీస్ స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సిఐ శ్రీనివాసులుని ఎంఆర్‌పిఎస్ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి రాగిపట్టు రాఘవయ్య, సత్యవేడు మండల కన్వీనర్ తాడి జనార్దన్, ఎంఎస్ఎఫ్ నాయకుడు ధనరాజు, కోటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు బహుమతుల పంపిణీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక గేటు పుత్తూరు బాలుర గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో 2023 – 24 విద్యా సంవత్సరంలో ఉత్తమ మార్కులు సాధించిన రుణ్మాక్ష్ (533), కె దినేష్, (486),ఎన్ మోహన్, (484) విద్యార్థులకు. మండల విద్యాశాఖాధికారులు, తిరుమల రాజు , బాల సుబ్రమణ్యం నగదు, షీల్డ్, మెడల్స్ బహూకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఎం. శేషగిరి , ఎం ఎస్ సి వైస్ ఛైర్మన్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఎంఇవో కే హేమమాలిని అధ్యక్షతన మాదకద్రవ్యాల, మత్తు పదార్థాల వినియోగం – దుష్పరిణామాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఫోరెన్సిక్ ఎక్స్పర్ట్ త్రినేత్ర ఫోరెన్సిక్ సైన్స్ అండ్ సర్వీసెస్ డి నాగేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలను వివరించారు. మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా సమాజ శ్రేయస్సుకు పాటు పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరి ప్రకాష్ ,ఉపాధ్యాయులు ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి: జడ్జి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వచ్చే నెల 14వ తేదీ నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జ్ రాఘవేంద్ర పేర్కొన్నారు. శుక్రవారం పుత్తూరు కోర్టు ఆవరణలో న్యాయవాదులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా పుత్తూరు మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సి రాఘవేంద్ర మాట్లాడుతూ రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయం, ధనం ఆదా అవుతుందన్నారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు దాని పై అప్పీల్ ఉండదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సి జానకి, పుత్తూరు న్యాయ వాదుల సంఘం అధ్యక్షులు కె పురుషోత్తం, కార్యదర్శి. మురళి రెడ్డి, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలో ధనుష్ శేఖర్ ప్రతిభ

ప్రజాశక్తి -రామచంద్రపురం(చంద్రగిరి): తమిళనాడు షోలింగరంలో నిర్వహించిన అండర్–14 తొమ్మిదవ జాతీయ స్థాయి టెన్నిస్ బాల్, క్రికెట్ పోటీలలో చంద్రగిరి శ్రీ చైతన్య చిల్డ్రన్స్ అకాడమీకి చెందిన 8వ తరగతి విద్యార్థి ధన శేఖర్ ఆంధ్రప్రదేశ్ తరపున ఫాస్ట్ బౌలర్ గా ఉత్తమ ప్రతిభను కనబరిచారు. తన ప్రతిభను గుర్తించిన సెక్షన్ అసోసియేషన్ సెలక్షన్ కమిటీ సభ్యులు రంభ దుర్గా ప్రసాద్ ధన శేఖర్ విద్యార్థికి జాతీయ జట్టుకి అయ్యే ఖర్చులు మొత్తం తమ అసోసియేషన్ స్పాన్సర్‌షిప్ అందిస్తుందని తెలిపారు. ఇంతటి అవకాశం దక్కించుకున్న విద్యార్థి ధన శేఖర్‌ను స్కూల్ కరస్పాండెంట్ బివి కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ సురేష్ అభినందనలు తెలిపారు.

రోడ్డు కల్వర్టు నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి - పిచ్చాటూరు: నారాయణవనం మండలం భీముని చెరువు రోడ్డు కల్వర్టు నిర్మాణానికి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, కలెక్టర్ వెంకటేశ్వర్లు శుక్రవారం భూమి పూజ చేశారు. అంతకు ముందు భీముని చెరువు గ్రామానికి విచ్చేసిన కలెక్టర్ వెంకటేశ్వర్లుకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం కల్వర్టు నిర్మాణానికి ఎమ్మెల్యే, కలెక్టర్ కొబ్బరి భూమి పూజ చేశారు. అనంతరం నారాయణవనం లో జరిగే గ్రామ సభకు ఎమ్మెల్యే, కలెక్టర్ బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ మదనగోపాల్, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంఏ ఫలితాల్లో మాస్టర్ మైండ్‌కు ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ది ఇన్స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ ఆఫ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా శుక్రవారం విడుదల చేసిన సీఎం ఏ ఫలితాలలో తిరుపతికి చెందిన మాస్టర్ మైండ్స్ విద్యార్థి వై వర్షిత రెడ్డి ఆల్ ఇండియా మొదటి ర్యాంకు సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ రావు తెలిపారు. ఆ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం అయిన విలేకరులతో మాట్లాడుతూ సీఎంఏ ఫలితాల్లో తమ విద్యార్థులు ఆల్ ఇండియా మొదటి ర్యాంకు తో పాటు 19వ ర్యాంకు 34 ర్యాంకు కూడా సాధించారన్నారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులు ఆయన అభినందించారు. వారికి సహకరించిన అధ్యాపకులు తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర టెన్నికాయిట్ పోటీలకు జట్టు ఎంపిక

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా టెన్ని కాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టెన్ని కాయిట్ క్రీడా పోటీలు శుక్రవారం నిర్వహించారు. పలు పాఠశాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు 60 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి నెల్లూరు జిల్లా టెన్ని కాయిట్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ బండి శ్యాంసుందరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జట్టు కు ఎనిమిది మంది ఎంపికయ్యారని తెలిపారు. వీరికి శిక్షణ శిబిరం ఏర్పాటు చేసి సీనియర్ టెన్ని కాయిట్ కోచ్‌లు శిక్షణ అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టెన్ని కాయిట్ ఉపాధ్యక్షుడు పైడి కోటేశ్వరరావు , జాయింట్ సెక్రెటరీ పి భాస్కర్ , ఈసీ మెంబర్ మల్లికార్జున్ ,తిరుపతి జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘ అధ్యక్షులు కరీముల్లా ఖాన్ పాల్గొన్నారు.

నగర మేయర్ ను కలిసిన గ్రేటర్ జైపూర్ బృందం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి మేయర్ డాక్టర్ శిరీషను శుక్రవారం గ్రేటర్ జైపూర్ బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. తిరుపతి నగరపాల సంస్థలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై గ్రేటర్ జైపూర్ బృందం ఆరా తీసింది. ఇందులో తాగునీరు సరఫరా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ,ఆస్తి పన్నుల వసూళ్లు, భవన నిర్మాణ అనుమతులపై ఆ బృందం మేయర్ డాక్టర్ శిరీషను అడిగి తెలుసుకున్నారు. తర్వాత మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులను అడిగి తెలుసుకున్నారు. .ఈ కార్యక్రమంలో మేయర్ తో పాటు అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, ప్రజా ఆరోగ్య అధికారి యువ అన్వేష్,కార్పొరేటర్ నారాయణ పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ధ్యేయం : ఎమ్మెల్యే

దొరవారిసత్రం: పేదరికనిర్మూలన, గ్రామాల్లో మౌలిక వస్తువులు కల్పన,ప్రజాభివృద్ధే మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యం అని సులూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు.ఆమె మండల పరిధిలో శుక్రవారం నిర్వహించిన వెదురుపట్టు పంచాయితీ గ్రామసభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి టిడిపి పాలనలో పేదరిక నిర్మూలన,ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఎస్సీ ఎస్టీ కాలనీలోనివసిస్తున్న ప్రతి కుటుంబంలో అర్హులైన వారికి ఉపాధి హామీ పనుల్లో స్థానం కల్పించాలన్నారు. కాలనీల్లో సిసి రోడ్లు నిర్మాణం చేపట్టాలని సూచించారు.గ్రామ సభలో ప్రతిపాదనలు చేసిన ప్రతి పనినిపూర్తి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేని మాజీ సర్పంచ్ మనోహర్ రెడ్డి, పార్టీ నాయకులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శైల కుమారి, ఎంపీడీవో రఘురామయ్య, ఎంఈఓ కృష్ణయ్య, ఏడి అనిత, ఏవో కిరణ్మయి, వెలుగు ఏపిఎం పద్మావతి,ఐ సిడిఎస్ సూపర్వైజర్ హేమలత,మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు నాయుడు, పాల్గొన్నారు.

ప్రతికూల ఉద్వేగాలు ప్రగతికి ప్రతిబంధకాలు

- సైకాలజిస్ట్ సుధాకర్ రెడ్డి


ఎన్‌బి సుధాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న అధ్యాపకులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : యుక్త వయస్సులో చెలరేగే ఉద్వేగాలను నియంత్రించుకుంటేనే అనుకున్న లక్ష్యాలు సాధించవచ్చని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ఎన్‌బి సుధాకర్‌రెడ్డి హెచ్చరించారు. పుత్తూరు ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు వ్యక్తిత్వ నిర్మాణం, లక్ష్య సాధన అన్న అంశంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఇంటర్ చదివే వయస్సులో ఉన్నత లక్ష్యాలు ఉన్నప్పటికీ వ్యక్తిత్వ లోపాలు తలెత్తుతుంటాయన్నారు. కొందరిని విపరీత ధోరణి, మితి మీరిన ఉద్వేగాలు దారి తప్పేలా చేస్తాయన్నారు. శృంగార వ్యామోహం అపరిపక్వ ప్రేమలకు దారి తీస్తుందన్నారు. కొందరిలో హింసాత్మక ప్రవృత్తి తలెత్తుతుందని తెలిపారు. కొద్దిమంది మాదక ద్రవ్యాల సేవనం, ఇతర వ్యసనాలకు బానిసలుగా మారుతారని పేర్కొన్నారు. మితి మీరిన స్వేచ్ఛను కోరుకోవడం, తల్లిదండ్రులను ఎదిరించడం, చెడు స్నేహాలు చేయడం అలవాటు అవుతుందన్నారు. దీనివల్ల పీడకలలు, పిచ్చి ఆలోచనలతో నిద్ర పట్టదని తెలిపారు. వ్యక్తిత్వం, మనసు దారి తప్పడం వల్ల ఏకాగ్రత, జ్ఞాపక శక్తి తగ్గిపోతాయన్నారు. దీంతో పరీక్షల భయం, ఆందోళన, డిప్రెషన్ ఆవహిస్తాయని తెలిపారు. సంఘర్షణ తలెత్తుతుందన్నారు. యవ్వనపు దశలో సానుకూల ఆలోచనలు అలవాటు చేసు కోవాలని సూచించారు. ఎవరికి వారు తమ లోపా లను గుర్తించి సరిదిద్దుకోవాలన్నారు. మంచి స్నేహాలు, సత్సాంగత్యం, చక్కని అభిరుచులు ఏర్పరచుకోవాలన్నారు. లక్ష్య సాధనపై దృష్టి పెట్టాలని చెప్పారు. అనంతరం అధ్యాపకులు కళాశాల ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో సైకాలజిస్ట్ సుధాకర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దరిశా గోపాల్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా నేషనల్ స్పేస్ డే వేడుకలు

సూళ్లూరుపేటలో

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: పెళ్లకూరు మండలంలోని ఉన్నత పాఠశాలలలో శుక్రవారం నేషనల్ స్పేస్ డే పురస్కరించుకొని విద్యార్థిని విద్యార్థులకు వారి ప్రతిభను, సృజనాత్మకతను వెలికి తీసేందుకు వారి చేత వివిధ ప్రతిమలను, సైన్స్ పరికరాలను తయారు చేయించి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తాల్వాయిపాడు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ టీచర్ స్వరూపకుమారి సైన్స్ ప్రాధాన్యత, గొప్పదనం గురించి వివరించారు. విజయవంతం చేసిన చంద్రయాన్ గురించి తెలిపారు. పిల్లలు ఇండియన్ స్పేస్ గురించి ప్రసంగించారు. విజేతలైన పిల్లలకు ప్రధానో పాధ్యాయులు కె.దొరస్వామి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: మొదటి జాతీయ అంతరిక్ష దినోత్సవం ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఎస్‌వి ఎస్ఎస్‌సి గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్–ఎల్‌బి శంకర్ మాట్లాడుతూ శ్రీహరికోట స్పేస్ సెంటర్ కు దగ్గరగా ఉండటం మన అదృష్టం అన్నారు. ప్రతి రాకెట్ లాంచింగ్ మనం కళ్ల చూస్తున్నామని ఈ కోవలో చంద్రయాన్ 3 అనుకున్న అంచనాలకు చేరి భారతదేశం కీర్తి ప్రతిష్టలు ప్రపంచ దేశాలకు చాటిందని, ఇలాంటి మంచి కార్యక్రమాలు జరిపిన ఫిజిక్స్ విభాగాన్ని అభినందించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ వి.రాజా, ఫిజిక్స్ విభాగ అధిపతి అధ్యక్షత వహించారు. అనేక పోటీలలో పాల్గొని విజేత లకు ప్రిన్సిపల్ చేతుల మీదుగా బహుమ తులు అందించారు. ఈ కార్యక్రమం డాక్టర్ జె. సుబ్రహ్మణ్యం ఫిజిక్స్ అధ్యాపకుల వందన సమర్పణ తో ముగించారు. ఈ కార్యక్రమంలో జి.వెంకటరామిరెడ్డి, డాక్టర్ సి సల్మా, డాక్టర్ బాబు, నాగభూషణం, శ్రీనివాస్, ఉషారాణి, అమ్మాజీ, పి ఏడుకొండలు, టి పోలయ్య ఇతర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని విజయవంతం చేశారు.

సత్యవేడు: సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆన్లైన్లో విచ్వల్ ప్రోగ్రామ్‌ను విద్యార్థిని విద్యార్థులు, అధ్యాపక బృందం వీక్షించారు. జాతీయ అంతరిక్ష దినోత్సవంపై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. ఆనంద రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి శామ్యూల్ అరవింద్ అధ్యాపకులు ఎం.హరి ప్రసాద్,ఎం.మురళీమోహన్, ఎస్.వి.శంకర్, ఎం వెంకటేశ్వర్లు,వి.ఎస్.ఎం. బాషా, ఆర్ ఈశ్వరమ్మ,ఎస్ .సుధాకర్, జి.వెంకటేశ్వర్లు, ఓ హరిప్రసాద్ పాల్గొన్నారు.

క్యాంపస్ : స్పేస్ డేను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఐఆర్ఎస్ రిటైర్డ్ ఆఫీసర్ ఏ పురుషోత్తం నాయుడు విచ్చేసి, తిరుపతి రీజినల్ సైన్స్ సెంటర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్ నెహ్రూ, విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ డా.కె.సాంబశివమూర్తితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రీజినల్ సైన్స్ సెంటర్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ నెహ్రూ, అకాడమిక్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ విష్ణుభట్టాచార్యులు, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ దక్షిణామూర్తి శర్మ, డీన్ స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రొపి వెంకట్రావు, సాహిత్య సంస్కృతి డీన్ ప్రొఫెసర్ సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : యువత శాస్త్ర, సాంకేతిక రంగాల పై ఆసక్తి పెంచుకోవాలని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పేర్కొన్నారు.శుక్రవారం గూడూరు పట్టణంలోని దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవం ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటుచేసిన అంతరిక్ష ప్రయోగాల ఫోటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు , విద్యార్థినులు పాల్గొన్నారు.

చిన్నగొట్టిగల్లు: స్థానిక గీతాంజలి స్కూలులో జాతీయ స్పేస్ డేని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ గిరికుమార్ రెడ్డి ప్రసంగించారు. విద్యార్థులు సైంటిస్టుల వేషధారణ అందరినీ ఆకట్టుకుంది. విద్యార్థులకు శాస్త్ర సాంకేతిక విషయాలపై క్విజ్ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గిరిజనులు ఇళ్ల స్థలాలకు అర్హులే : సిపిఎం

సిపిఎం నాయకులు మిలుగు రమేష్

ప్రజాశక్తి - సత్యవేడు: తిరుపతి జిల్లా సత్యవేడు మండలం పేరడం గ్రామం రెవెన్యూ పరిధిలోని స్థలంలో అర్హులైన గిరిజనులు నిర్మించుకున్న నివాసాలను వక్రీకరిస్తూ శుక్రవారం సామాజిక మాధ్యమాలలో వచ్చిన కథనాలను సిపిఎం సత్యవేడు మండల కార్యదర్శి మిలుగు రమేష్ ఖండించారు. మిలుగు రమేష్ శుక్రవారం మాట్లాడుతూ పేరడం గ్రామంలో ఇళ్ల స్థలాలు లేని నిరాశ్రయులైన ఎస్‌టిలకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని గతంలో తహశీల్దార్ షేక్ జరీనాకి 35 మంది ఆధారాలతో కూడిన అర్జీలను సమర్పించామని అప్పటి తహశీల్దారు స్పందిస్తూ లబ్ధిదారులుగా 32 మందిని గుర్తించి వారికి ఇండ్ల స్థలాల పట్టాలు ఇవ్వనున్నట్లు ప్రకటించారన్నారు. అప్పటి స్థానిక ఎన్నికల కారణంగా పట్టాలు ఇవ్వలేదని, అనంతరంసత్యవేడు తహశీల్దారు బదిలీలో భాగంగా బాధ్యతలు చేపట్టిన తహశీల్దారు ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో నిమగ్నం కావడంతో ఆయన దృష్టికి తీసుకు వెళ్లలేదన్నారు. ఈ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లి అర్హులైన 32 మంది ఎస్టీలకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని తహశీల్దారును కోరనున్నట్లు తెలిపారు. ఈ స్థానిక సమస్యలు ఏమి పట్టనట్లుగా ఈ సమస్య రెవెన్యూ అధికారుల దృష్టిలో ఉన్నప్పటికీ సామాజిక మాధ్యమాలలో వక్రీకరించి ప్రచురించడం విచారించదగ్గ విషయమని వ్యాఖ్యానించారు. ఇదే పేరడం గ్రామ రెవెన్యూ పరిధిలో సుమారు 30 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిని భూ కబ్జాదారులు ఆక్రమించుకొని వాటి ఫలాలను అనుభవిస్తున్నప్పటికీ వారిని ఎందుకు ప్రశ్నించ లేదన్నారు. నిరుపేదలైన ఎస్టీల నివాస స్థలాలపై పనిగట్టుకొని పత్రిక కథనాలను ప్రచురించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఇప్పటికన్నా వాస్తవ కథనాలను తెలుసుకొని నిరుపేదలైన ఎస్టీల పక్షాన నిలబడి వారికి న్యాయం చేకూరేల పత్రిక కథనాలు రాయాలని పత్రిక ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా శంకర్ జిమ్ వార్షికోత్సవం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: శంకర్ జిమ్ 20వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తిరుపతి ఎమ్మెల్యే కుమారుడు ఆరని మదన్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మదన్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా శంకర్ జిమ్ ప్రజలు ఆరోగ్యవంతంగా వుండడానికి ఎప్పటికప్పుడు నూతన పరికరాల ఏర్పాటుతో పాటు ప్రజల జీవనశైలికి అనుగుణంగా వ్యాయామ మార్పులు తీసుకువస్తున్న జిమ్ అధినేత దండు దామోదర్ ని అభినందించారు. ఈ కార్యక్రమంలో దామోదరం, అతని మిత్రుడు పాల్గొన్నారు.

బాలుర హాస్టల్ తనిఖీ

ప్రజాశక్తి - పిచ్చాటూరు: సత్యవేడు నియోజకవర్గం నారాయణవనం మండలం పాలమంగళం దక్షిణ కండ్రిగలోని ఎస్సీ హాస్టల్ ని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా బాలుర ఎస్సీ హాస్టల్లో ఎంతమంది విద్యార్థులు వుండి చదువు కుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. హాస్టల్లో 36 మంది విద్యార్థులకు ప్రతిరోజు ప్రభుత్వం తరపున అందుతున్న మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్టల్ గదులను కిటికీలను పరిశీలించి మరమ్మతు పనుల గురించి జిల్లా వెల్ఫేర్ డిడి అధికారులకు తెలిపారు. అనంతరం పిల్లలకు అందించే భోజనాన్ని పరిశీలించి రుచి చూశారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డిడి చెన్నయ్య, డిడి బిసి వెల్ఫేర్ డిడిచంద్రశేఖర్, మండల టిడిపి అధ్యక్షులు ఎన్ భాస్కరన్, మాజీ నెడ్ క్యాప్ ఛైర్మన్ ఏకాంబరం, మాజీ ఎంపీపీ గోవిందస్వామి, స్థానిక నాయకులు టి సుబ్రహ్మణ్యం, బి ఎం నరేష్, పురుషోత్తం, కోదండమ్, హాస్టల్ వార్డెన్ రమేష్ బాబు పాల్గొన్నారు.

ఉద్యోగి గొంతుకను నొక్కిపెట్టారు: చీర్ల కిరణ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గత వైసిపి ప్రభుత్వ హయాంలో సిపిఎస్ రద్దు చేస్తామని ఉద్యోగుల ఓట్లతో గద్దెనెక్కిన అప్పటి సర్కారు పెద్దలు ఉద్యోగుల గొంతు కను నొక్కి పెట్టారని ఆంధ్రప్రదేశ్ సిపిఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అసోసియేట్ ప్రెసిడెంట్ చీర్ల కిరణ్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేస్తామని నమ్మబలికి ఉద్యోగులను మోసం చేస్తూ గత వైసిపి ప్రభుత్వం జిపిఎస్ విధానాన్ని తీసుకొచ్చిందని, పిఆర్సి ఇస్తామని రివర్స్ పిఆర్సి బలవంతంగా రుద్దారని అన్నారు. కూటమి ప్రభుత్వమైన సీపీఎస్ ఉద్యోగు లకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సెప్టెంబర్ ఒకటిన ఆంధ్రప్రదేశ్ సిపిఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ బ్లాక్ డేగా భావించాల్సి వచ్చిందన్నారు. సెప్టెంబర్ 1న విజయవాడలో సిపిఎస్ ఉద్యోగుల సదస్సును నిర్వహిస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ విభాగాల్లోని సిపిఎస్ ఉద్యోగులు ఈ ఒక సదస్సుకు తరలిరావాలని విజ్ఞప్తిచేశారు. ఈ సమావేశంలో ఏపీసిపిఎస్ఈఏ తిరుపతి జిల్లా అధ్యక్షులు వెంకీపురం పవన్ పాల్గొన్నారు.

ప్రగతి సేవా సంస్థ సేవలు అభినందనీయం: టిడిపి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పేదలకు ప్రగతి సేవా సంస్థ సేవలు అభినందనీయం అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెలబల్లి భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు.గూడూరు పట్టణంలోని బాలాజీ నగర్ లోని ప్రగతి సేవా సంస్థ కార్యాలయం నందు మహిళలకు మూడు కుట్టు మిషన్ లు నెలబల్లి భాస్కర్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు .

IN THE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE; TIRUPATI
I.P.No. 47 / 2022
Pericherla Nagaraju ...Petitioner
V/s
Pericherla Padmamma and others ...Respondents
NOTICE TO RESPONDENT NO.7
R7) Utukota Seenu S/o Utukota Ramanaiah R/o D.No. 12-105, Chinthavaram, Chillakur Mandal, Tirupati District.
పై పిటిషనరు, రెస్పాండెంట్ అయిన 7 దగ్గర పైకము తీసుకొని బాకీ తీర్చలేక తనను ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని కోర్టును కోరియున్నారు. సదరు కేసులో మీ యొక్క హాజరు నిమిత్తం కోర్టువారు తేది. **03.09.2024** ఉదయం 10.30 గం॥ల వాయిదా వేసి యున్నారు. సదరు తేదిన మీరు గాని లేక వకీలు ద్వారా హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపకొనవలసినది. లేని యెడల మీకు పరోక్షముగా తీర్మానించబడును.
Hearing Date: 03.09.2024
N.SARADA, C.PRABHAKAR
Advocates, Tirupati. Cell: 7207371117

శ్రీ నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O. S. No. 16 / 2022
శ్రీ లక్ష్మి శ్రీనివాసా ఆటో ఫైనాన్స్, R/P by మేనేజింగ్ పార్టనర్, ఎన్. సురేష్ బాబు .... వాది
V/s
ఎం. చెంచుక్రిష్ణ ....ప్రతివాది
ప్రకటన
ఎం. చెంచుక్రిష్ణ S/o చిన్న చెంచయ్య, రైల్వేఉద్యోగి, డోర్ నెంబరు–294/B, RE కాలనీ, ఓల్డ్ చెక్‌పోస్టు, రేణిగుంట, రైల్వే క్వాటర్స్, రేణిగుంట, తిరుపతి జిల్లా.
ఇందుమూలంగా మీకు తెలియజేయడం ఏమనగా వాది దగ్గర మీరు తీసుకున్న బాకీకి నిమిత్తము మీరు వాది పేరున ప్రామిసరీ నోటు వ్రాసి ఇచ్చివున్నారు.సదరు ప్రామీసరీ నోటు తాలుకా బాకీని మీ ద్వారా రాబట్టుకొనుటకు వాది పై కోర్టులో మీ పై దావా వేసివున్నాడు. సదరుకోర్టు వారు సదరు దావా సమన్లు పలుమార్లు మీకు పంపిన జారీ కానందున పై కోర్టు వారు మీ హాజరు నిమిత్తము పైకేసును వాయిదా తేది.25–9–2024 వేసి వున్నారు. కావున మీరు ఆ రోజు ఉదయం 10.30 నిమిషాలకు హాజరై మీకు గల అభ్యంతరములను తెలుపుకొనవచ్చును. లేనిచో మీ పరోక్షమున అభ్యంతరము లేదని భావించి పై కేసును ఆక్షేపణలు లేవని కోర్టు తీర్మానించెదరు.
ఇట్లు
ఆశ. చెంచుక్రిష్ణయ్య, బి.కాం., బి.ఎల్., వాది తరపున న్యాయవాది నాయుడుపేట.

శ్రీ నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O. S. No. 113 / 2023
కాపులూరు గోపి .... వాది
V/s
పట్టుకోట శ్రీనివాసులు ....ప్రతివాది
ప్రకటన
పట్టుకోట శ్రీనివాసులు, S/o చెంచయ్య, అన్నవేడు గ్రామం మరియు పోస్టు, నాయుడుపేట మండలం, తిరుపతి జిల్లా.
ఇందుమూలంగా మీకు తెలియజేయడం ఏమనగా వాది దగ్గర తీసుకున్న బాకీకి నిమిత్తము మీరు వాది పేరున ప్రామిసరీ నోటు వ్రాసి ఇచ్చివున్నారు. సదరు ప్రామీసరీ నోటు తాలుకా బాకీని మీ ద్వారా రాబట్టుకొనుటకు వాది పై కోర్టులో మీ పై దావా వేసివున్నాడు. సదరు కోర్టు వారు సదరు దావా సమన్లు పలుమార్లు మీకు పంపిన జారీ కానందున పై కోర్టు వారు మీ హాజరు నిమిత్తము పై కేసును వాయిదా తేది.12–9–2024 వేసి వున్నారు. కావున మీరు ఆ రోజు ఉదయం 10.30 నిమిషాలకు హాజరై మీకు గల అభ్యంతరములను తెలుపుకొనవచ్చును. లేనిచో మీ పరోక్షమున అభ్యంతరము లేదని భావించి పై కేసును ఆక్షేపణలు లేవని కోర్టు తీర్మానించెదరు.
ఇట్లు
ఆశ. చెంచుక్రిష్ణయ్య, బి.కాం., బి.ఎల్., వాది తరపున న్యాయవాది, నాయుడుపేట.

క్రైం న్యూస్

పురుగుల మందు తాగిన ప్రేమజంట

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి): ఓ ప్రేమ జంట పురుగుల మందు తాగిన సంఘటన చంద్రగిరి మండలం శ్రీనివాస మంగాపురం శ్రీవారి మెట్టు నడకదారిలో శుక్రవారం చోటు చేసుకుంది. పెళ్లై ముగ్గురు పిల్లలున్న ఓ మహిళ ఓ యువకుడి ప్రేమలో పడింది. 3 రోజుల క్రితం ఇద్దరూ ఇంటి నుంచి పారిపోయి తిరుమలకు చేరుకున్నారు. స్వామివారి దర్శనం చేసుకొని అనంతరం తిరుగు ప్రయాణంలో శ్రీవారిమెట్టు నడకమార్గం ద్వారా చంద్రగిరికి వస్తుండగా 450వ మెట్టు దగ్గరకు చేరుకున్నారు. ఇద్దరూ కలిసి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. భక్తులు వారిని చూసి చంద్రగిరి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అనంతరం వీరిని 108 సాయంతో చికిత్స నిమిత్తం తిరుపతి రూయాకు తరలించారు. ఈ ప్రేమజంటది చిత్తూరు టౌన్, బంగారురెడ్డి పల్లె ఎస్టీ కాలనీకి చెందిన సతీశ్, రాధికగా పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం వీరు తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఎనిమిది మంది స్మగ్లర్లు అరెస్టు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధి అన్నమయ్య జిల్లా బాలపల్లి అటవీ ప్రాంతంలోనూ, తిరుపతి జిల్లా చంద్రగిరి పట్టణంలో 33ఎర్రచందనం దుంగలు, కారును స్వాధీనం చేసుకుని, ఎనిమిది మంది స్మగ్లర్లను శుక్రవారం టాస్క్ ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్సు ఇన్చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్సు ఎస్పీ కే.శ్రీనివాస్ అధ్వర్యంలో గురువారం రెండు బృందాలు ఆపరేషన్లలో భాగంగా అన్నామయ్య జిల్లా బాలపల్లి, భాకరాపేట అటవీ ప్రాంతాల్లో కూంబింగ్ చేపట్టాయని టాస్క్ ఫోర్స్ అధికారులు తెలిపారు. ఆర్ఐ కృపానందకు చెందిన ఆర్ఎస్ఐ కే. అల్లిబాషా బృందం స్థానిక అటవీ అధికారులతో కలసి సిద్ధలేరు నుంచి కూంబింగ్ చేస్తూ శుక్రవారం ఉదయం రాజంపేట డివిజన్ బాలపల్లి బీటు పరిధిలో దాట్లు సమీపానికి చేరుకోగా కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను మోసుకుని వస్తూ కనిపించారన్నారు. టాస్క్ ఫోర్స్ బృందాన్ని చూసి పారిపోతుండగా ఆరుగురు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వీళ్ళు తమిళనాడు రాష్ట్రం కల్లకురుచ్చి జిల్లాకు చెందిన చంద్రశేఖర్ (22), శంకర్ (29), వెంగటేశన్ (34), ఎంజీఆర్ (46), లక్ష్మణన్ (57), సెల్వరసు (21)లుగా గుర్తించామన్నారు. ఆ ప్రాంతంలో పడి ఉన్న 25ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామని, అదేవిధంగా ఆర్ఐ (ఆపరేషన్స్) కే.సురేష్ కుమార్ రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐ కేఎస్ కే లింగాధర్ బృందం తిరుపతి జిల్లా చంద్రగిరి వైపు గల అటవీ ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహిస్తుండగా కల్యాణి డ్యాం నుంచి ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను తనిఖీ చేస్తూ వచ్చారన్నారు. భాకరాపేట రేంజి, నాగపట్ల సెక్షన్ పరిధిలోని నరసింగాపురం రైల్వే బ్రిడ్జి కింద కొందరు వ్యక్తులు కారులో ఎర్రచందనం దుంగలను లోడింగ్ చేస్తూ కనిపించారన్నారు. టాస్క్ ఫోర్సు బృందాన్ని చూసి స్మగ్లర్లు కారును వేగంగా నడుపుతూ వెళ్ళిపోయారన్నారు. బైక్ పై స్మగ్లర్ల వాహనాన్ని వెంబడించి లింగాధర్ బృందం చంద్రగిరి క్లాక్ టవర్ వద్ద అడ్డుకున్నారన్నారు. కారులో ఏడు ఎర్రచందనం దుంగలు లభించగా, రైల్వే బ్రిడ్జి కింద ఒక ఎర్రచందనం దుంగ లభించిందన్నారు. వీరిద్దరిని తమిళనాడు తిరువన్నామలై జిల్లాకు చెందిన హరిస్టాటిల్ రవి(30), రంజిత్ చిన్నపయ్యాన్ (30)లుగా గుర్తించామన్నారు. ఈ రెండు వేరు వేరు ఘటనలపై టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్లో సిఐ సురేష్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారన్నారు.

ప్రభుత్వ విద్యా సంస్థలు ఏర్పాటు చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి నగరంలో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయాలని విద్యార్థులకు అను గుణంగా ప్రభుత్వ ఎస్సి, ఎస్టీ, బిసి సంక్షేమ, ఎస్ఎం ఎస్ హాస్టల్స్ ఏర్పాటు చేయాలనీ ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం జరిగిన ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అక్బర్ అధ్యక్షతన సమావేశంలో జిల్లా కార్యదర్శి భగత్ రవి మాట్లాడుతూ తిరుపతి నగరంలో విద్యా హబ్ పేరుకు తప్ప పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు చదువుకునేందుకు టీటీడీ, ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు తప్ప ప్రభుత్వ విద్యా సంస్థలు లేకపోవడం అన్యాయమని వాపోయారు. టీటీడీ విద్యా సంస్థలో అనేక జిల్లాల నుంచి విద్యార్థులు చదువుతున్నారని, స్థానికంగా విద్యార్థులకు సీట్లు పరిమితం కావడం వల్ల ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలో డబ్బులు వెచ్చించి చదువుకోవడం భారం తో అనేక మంది ఉన్నత విద్యకు దూరం అవుతున్నారన్నారు. పక్కన చంద్రగిరిలోనూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేక విద్యార్థులు మధ్యలోనే చదువుకు దూరం అవుతున్నారని హాస్టల్‌లో పరిమిత సీట్లు వల్ల అనేక మంది విద్యార్థులు పీజీ లో ఉంటూ నెలకు ఐదువేల రూపాయలు కట్టుకుంటూ పార్ట్ టైం జాబ్స్ చేస్తూ విద్యను సక్రమంగా వినియోగించుకోవడం లేదని తక్షణమే విద్యార్థులకు అనుగుణంగా హాస్టల్స్ ను పెంచి అందరికీ సీట్లు ఇవ్వాలని కోరారు. ఈ నెల 26 నుంచి సెప్టెంబర్ 10 వరకు ఎస్ఎఫ్ఐ సభ్యత్వం డ్రైవ్ చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వినోద్, నరేంద్ర, తేజ సహాయ కార్యదర్శి గురువయ్య, జిల్లా కమిటీ సభ్యులు వీరేస్, మనోజ్, గణేష్, అశోక్, వరప్రసాద్ పాల్గొన్నారు.

తప్పిన అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - ఓజిలి : మండల కేంద్రంలోని దళితవాడ ప్రాథమిక పాఠశాలలోని వంటశాలలో గ్యాస్ లీక్ అయి మంటలు చెలరేగాయి. మధ్యాహ్న భోజన కార్మికురాలు వంట నిర్వహిస్తున్న సమయంలో హఠాత్తుగా మంటలు చెలరేగాయి. మధ్యాహ్న భోజనం కార్మికురాలు ప్రమాదం నుండి బయటపడటంతో ఊపిరి పీల్చుకున్నారు. పాఠశాలలోని ఉపాధ్యాయులు వెంటనే స్పందించి గ్రామ సభలో ఉన్న ఎంఈఓ శైలజ , ఎస్ఐ రవి బాబుకు సమాచారం తెలపడంతో హుటాహుటిన పాఠశాలకు చేరుకొని అగ్నిమాపక పరికరాలతో స్థానిక యువత స్పందించి మంటలను అదుపులో తీసుకొచ్చారు. వంటశాల తరగతులకు దూరంగా ఉండటంతో విద్యార్థులకు ప్రమాదం తప్పింది.

బోగస్ ఓటర్లు తొలగించండి

ఆర్‌డివోకు పులివర్తి సుధా రెడ్డి వినతి

ప్రజాశక్తి -రామచంద్రాపురం (తిరుపతి రూరల్): చంద్రగిరి నియోజకవర్గంలోని బోగస్ ఓట్లను ఇంటింటి ఓట్ల పరిశీలనలో గుర్తించి తొలగించాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధా రెడ్డి కోరారు. శుక్రవారం తిరుపతి ఆర్డిఓ కార్యాలయంలో రెవెన్యూ డివిజనల్ అధికారి నిశాంత్ రెడ్డి ని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ ఓటరు వెరిఫికేషన్ ఉన్న కారణంగా బిఎల్‌వోలు అప్రమత్తంగా ఉండి ఓటర్ వెరిఫికేషన్ ను చిత్తశుద్ధితో పనిచేసి దొంగ ఓట్లను పూర్తిగా తొలగించి నిర్దిష్టమైన ఓటరు జాబితాను తయారు చేయాలన్నారు. 2019 ఎన్నికలలో అధికారులు దొంగ ఓట్ల నమోదులో కీలకపాత్ర పోషించారని, సుమారు 50 వేల దొంగ ఓట్లు వున్నాయని వీటితోనే చంద్రగిరి ఎమ్మెల్యేగా చెవిరెడ్డి అప్పట్లో గెలుపొందారన్నారు. వీటిని పరిశీలించి తప్పులు లేని ఓటరు జాబితాను విడుదల చేయాలని ఆర్‌డీవోను కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువనేత సక్కూరి ధనుంజయ రెడ్డి పాల్గొన్నారు.